

# పెరుగన్నం

- డా. యల్.కె.సుధాకర్

కథల పోటీలో తృతీయ బహుమతిగా రూ.3,000 పొందిన కథ

**రెండు నిజాలూ ఒక సందేహం... రెండు రోజులుగా నన్ను పట్టిపీడిస్తున్నాయ్.**

**బోర్డ్ మీటింగ్ జరిగి మూడురోజులయింది. దాదాపు ఎనభై తొమ్మిది మందిని తొలగించడం ఖాయమైపోయింది. మనసంతా వెలితి. ఎవరిమీదో చెప్పలేని కసి.**

**"టు హెల్ విత్ పింక్ స్లిప్... టు హెల్ విత్ దిస్ గ్లోబలైజేషన్."**

ఇంతటి భీతావహ వాతావరణంలోనూ నవ్వు పులుముకున్న మొహాల్తో కృత్రిమ కరచాలనాలూ, ఫ్యూచర్ ప్లాన్స్ వగైరాలు మాత్రం సజావుగానే సాగిపోతున్నాయ్. దిగులు కొందరిలో స్పష్టంగానూ మరికొంతమందిలో గుంభనంగానూ కనిపిస్తూనే వుంది.

నాకు తెల్సిన నిజాల్లో ఒకటి... ఆ ఎనభైతొమ్మిది మందిలో శేఖరం ఒకడన్నది. ఏమాత్రం మార్పు కనబడని నవ్వు మొహం... అదే అల్లరి, అదే చలాకీతనం... అదే ఎనర్జీ... నా సందేహానికి కారణం అతడి ధీమా! మరోచోటేదైనా ఉద్యోగం దొరికిందా అంటే అదింకాలేదని సమాధానం. అయినా అతడికీ ధీమా ఎలా వచ్చింది? మొత్తానికి అతడూ పజిలైపోయేడు నాకు. నా ప్రక్క డిపార్ట్‌మెంట్ టీమ్‌లో సభ్యుడాకుర్రాడు. నాకన్నా చిన్న ఉద్యోగి.

అతడితో మాట్లాడాలనిపించింది.

"మీదేవూరు శేఖరం?" అన్నాను లంచ్ బ్రేక్‌లో.

"..." చెప్పేడు.

"ఊహు! దగ్గర్లోని పట్టణం కాదు. మీ అసలూరు. అదేదో మెట్టో, పల్లమో అంటుంటావే... అది"

నవ్వేస్తూ చెప్పేడు "మెరకండీ... మద్దుల మెరక" అని "ఆంధ్రప్రదేశ్ పటంలో గోదారొడ్డున ఓ గుండుసూదితో గుచ్చి ఆ రంధ్రాన్ని వెయ్యి భాగాలు చేస్తే ఎంతుంటుందో అది మా ఊరుసార్. అయినా ఇప్పుడా డీటెల్స్ దేనికి సార్."

"ఓసారి మీ ఊరెళ్లొద్దామని" అన్నాను. చాలా అసంబద్ధమైన విషయమది... ముఖ్యంగా అతడికి. కొంచెం ఆశ్చర్యం కూడా.

"దేనికి సార్!?" అదే నవ్వు.

ఈ కృత్రిమత్వాలకి, ఈ హిపోక్రసీలకీ దూరంగా... చాలా చాలా దూరంగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేని ఊళ్లోకి... అలాంటి ఊరుంటే చూపించండి ఛాలెంజ్ అంటూ కంగారు పెట్టే హోర్డింగ్స్ దూరంగా... టీవీలే జీవితం కాని గ్రామానికి... పగలంతా పనిచేసి, చెమటోడ్చిన కష్టంతో ఇళ్లకి చేరుకుని పిల్లలకి బువ్వదినిపించడంకోసం తపించే తల్లులున్న ఊళ్లోకి... 'పిజా'లంటే ఏంటో ఇంకా తెలీని కుగ్రామానికి వెళ్లి హాయిగా రెండ్రోజులు గడిపిరావాలనుంది. అప్పుడు మీ ఊరు గుర్తొచ్చింది. మీ ఊరే ఎందుగ్గుర్తొచ్చిందంటే... మీ ఊరి పేరు చెప్పేప్పుడు... నీ కళ్లల్లో తళుక్కున మెరిసే కాంతిపుంజం నన్ను ఉత్తేజితుణ్ని చేస్తుంటుంది. భలే 'ఛార్జింగ్'గా వుంటుందది. అన్నింటికీ మించి నీ నవ్వు... చూసినప్పుడెల్లా సాయంకాలపు అకస్మాత్తు వానజల్లుకి తడిసిన కనకాంబరాల సందడిలా వుంటుంది నీ నవ్వు... నాకు కవిత్వం తెలీదు గానీ నీ నవ్వుని చూస్తే అలానే అనిపిస్తుంది. మీ ఊరి మట్టి పరిమళాన్ని మోసుకువచ్చే మబ్బుతెరలా వుంటుంది. ఆ నవ్వుని నీకు ఆభరణం చేసిన ఆ ఊరినీ, ఆ కోనేరునీ, గుడిగోపురాన్ని ఓసారి చూసి రావాలనుంది శేఖరం."

**"నీ ఉద్యోగం మరో ఇరవైరోజుల్లో పోబోతోంది. నీకు పింక్ స్లిప్ ఖాయమైపోయింది. అలా అని అనుమానం వచ్చిన వాళ్లంతా ఎవరి సర్దుబాట్లలో వాళ్లున్నారు. మరి నువ్వేంటీ ఇలా ధీమాగా, ధైర్యంగా, నవ్వుతూ... నాకు నిన్ను చూస్తుంటే ఈర్ష్యగా వుంది తెలుసా! ఆ రహస్యం ఏంటో చెప్పవా? నీ ఊరే నీ రహస్యమా? అయితే ఆ పల్లెటూరిని ఓసారి చూపిస్తావా? ప్లీజ్"**

చాలా 'మెలోడ్రమేటిక్'గా ఇంకా చెప్పాలంటే లౌక్యంగా అలా మాట్లాడేను గానీ నిజానికి నేను అడగవల్సిన విధాన మిదీ... మనస్ఫూర్తిగా అయితే...

"నీ ఉద్యోగం మరో ఇరవైరోజుల్లో పోబోతోంది. నీకు పింక్ స్లిప్ ఖాయమైపోయింది. అలా అని అనుమానం వచ్చిన వాళ్లంతా ఎవరి సర్దుబాట్లలో వాళ్లున్నారు. మరి నువ్వేంటీ ఇలా ధీమాగా, ధైర్యంగా, నవ్వుతూ... నాకు నిన్ను చూస్తుంటే ఈర్ష్యగా వుంది తెలుసా! ఆ రహస్యం ఏంటో చెప్పవా? నీ ఊరే నీ రహస్యమా? అయితే ఆ పల్లెటూరిని ఓసారి చూపిస్తావా? ప్లీజ్" - అని అడిగి వుండాలి.

చాలా చిత్రంగా తమాషాగా శేఖరానికి కూడా నా రెండోదీ మనసులో దాచుకున్నదీ అయిన విషయమే అర్థమైనట్టుంది. ఆ విషయాలకే సమాధానం చెప్తున్నట్టు చెప్పుకొచ్చేడు నాకు...

★ వసంత కుసుమాకర రస్ 125 మి.గ్రా. రోజుకు మూడుసార్లు సేవిస్తే తల త్రిప్పుట తగ్గుతుంది.
ఇంటి వైద్యం

(18వ పేజీ తరువాయి)

రేడియోలో పాటలయిపోయేయి. ఏం కార్యక్రమం వస్తోందో తెలీదు. అసలు రేడియో విని ఎంత కాలం అయుంటుంది తెలీడానికి. నాలుగిళ్లవతల గుడిసెలోంచి వంట తాలూకు పొగ పైకి లేస్తోంది. పొలం పనిలోంచి వస్తూ వస్తూనే మందు పట్టించిన వాడెవడో నులక మంచం మీద కూర్చుని తత్వాలు పాడుకుంటున్నాడు. అతడి కూతురు లాంతరు వెల్తురులో చదూకుంటోంది.

ముంజుకాయల బండి నడుపుకుంటూ వెళ్లిన పిల్లాడింకా ఇంటికి రాలేదని వాడి తల్లి కంగారుగా పిలుస్తోంది. మళ్లీ పాటలొస్తొన్న స్టేషన్‌ని ట్యూన్ చేసారెవరో. ఈసారి కొత్త పాటలొస్తున్నాయ్ రేడియోలో. వాటితో శృతి కలిపి పాడుతున్నాడు ఓ కుర్రాడు. రామాలయంలో జనం చేరి టీవీలో సీరియల్ చూస్తున్నారు. దాని మీద చర్చ కూడా కొనసాగుతోంది. దూరంగా పొగలోంచి వెంకటస్వామిగారి ఆకారం మేమున్నచోటికొస్తోంది. పాలేరుతోపాటూ ఆయనా స్వయంగా వచ్చేసరికి శేఖరం వాళ్లక్క కంగారుపడింది.

వెంకటస్వామిగారు నమస్కారంతో పరిచయం చేసుకున్నాడు. మేం వచ్చినట్టు శేఖరం చెప్పాడా అన్నాను... నవ్విలేదన్నాడు. "నిజానికి శేఖరానికి నేనే చెప్పానండీ" అన్నాడు. ఈ ఊళ్లో అందరికీ అన్నీ వెంటనే తెలుస్తాయండీ. ఎవరో పెద్ద ఇంజనీరులా వున్నాయన ఫ్యామిలీ వచ్చేరు శేఖరింటికి అన్నారు. ఇక్కడకంటే మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికి తీసికెళ్దామని వొచ్చేను. పాలేరుని పంపడం మర్యాదకాదేమోనంది మా ఇంటావిడ అందుకే నాలుగడుగులు వేసినట్టూ వుంటుందని ఇలా వొచ్చేను. భోయనాలు చేసేరా? పడుకునేందుకయినా మా యింటికి తీసికెళ్లిపోతానని మీ, మా శేఖరాన్ని ఫోన్లో పర్మిషన్ అడిగాలెండి... వచ్చేయండి అన్నాడు. మా మండులోగిల్లో కూడా సెందమామ సూడొచ్చు అన్నాడు కొసమెరుపుగా. ఇక బయల్దేరక తప్పలేదు.

బోరింగ్ నీళ్లతో అక్కడే స్నానాలు చేస్తున్నవాళ్లని దాటుకుని, ఇళ్ల మధ్య సందులగుండా వెంకటస్వామిగారితోబాటూ శేఖరం వాళ్లక్కయ్య తోడురాగా బయల్దేరాం. ముంజుకాయ బండి పిల్లాడు దొరికినట్టున్నాడు. రెండు దెబ్బలేసిమరీ ఇంటికి తీసికెళుతోంది వాడి తల్లి. తత్వాలు పాడుతున్న తాగుబోతు వెంకటస్వామిగారి రాకని గమనించి పాటలాపేడు.

టీవీలో సీరియల్ అయిపోయింది. ఎవరో టీవీని కట్టేశారు.

నాకు ఆశ్చర్యంగానూ ఆనందంగానూ అన్పించింది. అదే విషయం వెంకటస్వామిగారితో అన్నాను. ఆయన మీసాల మాటునుంచి నవ్వేరు. టీవీ ప్రపంచకాన్ని పాడుచేసిందో లేదో అవేమీ నాకు తెలవ్వు కానీండీ... టీవీ చూడ్డం మాత్రం తప్పుకాదండి. అయితే దాన్ని ఎప్పుడు ఆపేయాలో తెల్సుకోకపోవడం మాత్రం తప్పేనండి. మా ఊరోళ్లకి టీవీని ఎప్పుడు కట్టేయాలో తెలుసండి. అన్నాడు కొంచెం గర్వంగా.

ఆయనిల్లొచ్చింది.

ఆ యింట్లో వెంకటస్వామిగారితోబాటూ ఆయన భార్య వెంకాయమ్మగారు తప్పించి పనివాళ్లు. లంకంత మండువా ఇల్లు. ఓ వేపంతా కొబ్బరి గుట్టలు. మరోవేపు ధాన్యంగాదెలూ, ఇంకోవైపున పశువులశాల. పట్నాల్లో లక్ష రూపాయలిచ్చి కొనుక్కెళ్లి స్టార్ హోటల్లో గోడకి తగిలించే ఫొటోలో వుండే సరంజామా అంతా వుంది ఆ ఆవరణలో.

శేఖరం మా ఊరినుంచి సక్కగా సదూకొని సాఫ్ట్‌వేరింజనీరయి కూడా ఆ వినయాన్నీ విధేయతని ఏమాత్రం పోనీయకుండా అలానే వుంటాడండి. ఆడంటే నాకిష్టం గర్వం కూడానూ. నేనే రెండ్రోజులకోసారి ఫోన్‌చేసి క్షేమాలు కనుక్కుంటుంటాను. వాడి నాన్న మా ఇంట్లో పాలేరండి పదిహేనేళ్ల క్రితం. వినడానికి మాలతికి ఆశ్చర్యంగానూ వింతగానూ వుంది ఇంకా ఇలాంటి మనుషులున్నారా అని ఆశ్చర్యం.



**వాళ్లు చేసే ప్రతి పని వెనుకా వున్న సైంటిఫిక్ లాజిక్ ఇంతోటి కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎగ్జిక్యూటివ్‌కీ అందునా (సిటీ) స్త్రీకి అర్థంకాకపోవడంలోని విషాదం నాముందు నిలువెత్తు ఆశ్చర్యార్థకాల్నీ ప్రశ్నగుర్తుల్నీ నిలబెడుతోంది.**

వాళ్ల లోగిల్లో మాకు పడకలేర్పాటు చేసేరు. వెంకాయమ్మగారు చాలా పెద్దరికంతో హుందాగా ప్రేమగా ఆదరించారు మాలతినీ... స్వప్ననీ.

ఉదయాన్నే మా కార్యక్రమం ప్రకారం చుట్టుపక్కలనున్న దేవాలయాల సందర్శన... అన్ని ఏర్పాట్లూ జరిగాయి. అనుకోకుండా కథ మలుపు తిరిగింది...

ఉదయాన్నే తయారవుతుండగా వెంకాయమ్మగారు హడావుడిగా వచ్చి వెంకటస్వామిగారికి ఏదో చెప్పేరు. ఆయన మొహం మహా ఆనందంగా వెలిగిపోతుండగా... "బావుందండీ సారూ! మీ మహాలక్ష్మి మీకు పన్జేప్పేసింది" అన్నారు నాతో.

ఒక్క క్షణం నాకు అర్థం కాలేదు. మాలతి వచ్చి విషయం ఇంగ్లీషులో చెప్పేదాకా. అప్పటికప్పుడు స్వప్నని యువరాణిలా మార్చేసారు. అంతా సపర్యలు చేసేస్తున్నారు. ముచ్చటపడిపోతున్నారు. అసలు ఆడపిల్లలే లేని వెంకటస్వామిగారు తమ మనమరాలికి చేయాలనుకున్న సందడంతా ఇప్పుడీ పిల్లకి చేసేస్తున్నారు. మొత్తం అమ్మలక్కలంతా ఓచోట చేరారు. కొబ్బరాకు కొట్టి చాప అల్లించారు. స్వప్నకి అప్పటికప్పుడు ముఖానికి పసుపు రాసి పేరంటాలంతా నూనె రాసి చాపమీద కూర్చోబెట్టారు. ఇల్లంతా ఒక పండగ సందర్భంగా మార్చేశారు. మాలతి విసుక్కుంటోంది... ఆడపిల్ల మెచ్యూర్ అయితే ఇంత హడావుడి ఎందుకో ఏంటో! ఇంకా ఈ పల్లెటూళ్లో... గోలా! అంటోంది... నిజం చెప్పొద్దూ ఓ ప్రక్క గర్వంగా కూడా ఫీలవుతోంది.

"పిల్ల మహాలక్ష్మిలా వుంది. మా ఇంట ఈ శుభకార్యం జరగాలనుంది. మా అదృష్టం. ఈ సందడి వెనుక శాస్త్రంవుందమ్మా అంటూ వెంకాయమ్మ వివరించి చెప్తుంటే అయిష్టంగానయినా మాలతి వింటోంది. వాళ్ల చేసే ప్రతి పని వెనుకా వున్న సైంటిఫిక్ లాజిక్ ఇంతోటి కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎగ్జిక్యూటివ్‌కీ అందునా (సిటీ) స్త్రీకి అర్థంకాకపోవడంలోని విషాదం నాముందు నిలువెత్తు ఆశ్చర్యార్థకాల్నీ ప్రశ్నగుర్తుల్నీ నిలబెడుతోంది.

మూడో రోజు స్నానంచేసేసి వెళ్లిపోతామన్నాం. ఏడో రోజుదాకా పథ్యం పెట్టాల్సిందే ఆగమన్నారు. రోజూ పప్పూ నెయ్యితో వంటలూ, బెల్లమూ నెయ్యీ తినిపించడం, ఒక క్రమ పద్ధతిలో ఆచారం మాటున శాస్త్రోక్తంగా వాళ్లు ఒక ఆడపిల్ల తాలూకు ఆరోగ్యాన్ని తీర్చిదిద్దడం ముచ్చటగా వుంది. అలా అనుకోకుండా శేఖరం వాళ్ల ఊళ్లో పదిరోజులుండి పోవాల్సి వచ్చింది.

ఏడో రోజున వెంకటస్వామి గారింట్లో ఫంక్షన్ కూడా ఏర్పాటయింది. ఖర్చు నేను పెట్టుకుంటానంటే వద్దన్నారు. శేఖరం కూడా వచ్చాడు. పల్లెటూళ్లో నా కూతురి పేరంటం నేను కోరకుండానే అందిన వరంలా జరిగింది. శేఖరం మరో ఉద్యోగంలోకి మారబోతున్నాడట.

ఆ మనుషులూ, ఆ వాతావరణం, ఆ ఆప్యాయతా, జీవితం పట్ల ఏ కంప్లయింటూ లేని నిశ్చింత బహుశా ఈ ప్రయాణంలో నేను ఏమేమి ఆశించానో అన్నీ దొరికినట్టే వున్నాయి. శేఖరం హృదయమంత సంతోషంగా ఎందుకుంటుందో... ఉద్యోగం పోయినాసరే శేఖరం ఎందుకు ఆనందంగా ఉండగలడో అర్థమయ్యాక... నా సందేహం తీరింది.

స్వప్నకి వెంకటస్వామి దంపతులు పట్టుబట్టలు పెట్టారు. తమ దత్తత మనవరాలేనని పొగిడేరు. ప్రతీ శలవులకీ వచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. మాలతి వాళ్లని సిటీకి రమ్మంది. మేం తిరుగు ప్రయాణమయ్యాం... నిజానికి మా ఉద్యోగాల్లో పది రోజులు ఇద్దరు ఎగ్జిక్యూటివ్స్ శలవంటే మామూలు మాటలు కాదు. కానీ ముందే చెప్పినట్టు ప్రస్తుతం మా వ్యవస్థ మునిగిపోతోన్న ఓడ కదా... అందుకు వీలయింది.

"అమ్మమ్మగారింట్లో పెరుగన్నం సూపర్ డాడీ" అంటోంది స్వప్న. "మా ఫ్రండ్స్‌ని ఈసారి ఈ ఊరు తీసికొచ్చి తినిపిస్తా డాడీ" అంటో ఆనందపడిపోతోంది.

"చాల్లే... నోర్మూయ్" అంటోంది మాలతి.

తిరుగు ప్రయాణంలో మాలతి ఫంక్షన్ జరగడం గురించి సంతోషం వ్యక్తం చేస్తూనే

"అసలీ పల్లెజనం ఏంటో వీళ్ల తీరేంటో ఇంత బహిరంగంగా ఫంక్షన్లేంటో ఈ విషయానికి... రహస్యంగా ఊరుకుంటే పోయేదానికి" అంటోంది... నేను ఎప్పటిలానే వింటున్నాను. స్వప్నకి అంతా కొత్తగానూ సంతోషంగానూ వుంది. ఎప్పుడెప్పుడు సెల్ సిగ్నల్ వస్తుందా, దాని ఫ్రండ్స్‌కి ఈ విశేషాలన్నీ చెప్పేద్దామా అని ఆతృతపడి పోతోంది.

మూడువేల రూపాయల ప్లేట్ నూడిల్స్‌కీ వీకెండ్ రిసార్ట్ వార్మ్ అప్‌లకీ అలవాటుపడిపోతున్నవాళ్లం... ఈ పల్లెల ఆత్మీయతల్ని ఎలా స్వీకరించగలం అనాలనుకున్నాను మాలతితో... అనలేదు- అన్నట్టు మాలతి 'రహస్యంగా ఊరుకుంటే'- అంది కదూ అలా అనగానే గుర్తొచ్చింది నాకు...

పదిహేను రోజుల క్రితం బోర్డ్ మీటింగ్ జరిగిన రెండ్రోజులకి నాకు తెల్సినవి రెండు రహస్యాలన్నాను కదూ! అందులో ఒకటి శేఖరానికి పింక్ స్లిప్ గురించి. మరో రహస్యం ... నా ఉద్యోగం ఊడపీకేస్తూ ఇవ్వబోయే పింక్ స్లిప్ గురించి. ఆ ఎనభై తొమ్మిది మందిలో నేనూ ఒకణ్నే... ఆ బోర్డ్ మీటింగ్‌లో నా భార్య కూడా పాల్గొంది. తనే సంతకం కూడా పెట్టి వుంటుంది. అయినా తన ఉద్యోగ ధర్మం పాటిస్తూ నా దగ్గర రహస్యంగానే వుంచింది. ఈ పది రోజుల ప్రశాంతత నాలో కొత్త సంతోషాన్ని నింపింది... సరే...

పల్లె మా కారు దుమ్ములో మాయమైపోతోంది.

పట్నం వేపు మళ్లీ సాగిపోతున్నాం... నేనూ మాలతీ... మా స్వప్న.

★



★ జీవనీయ ఘృతము పది మి.లీ. రోజుకు మూడుసార్లు లేదా పంచగవ్య ఘృతము పది మి.లీ. రోజుకు మూడుసార్లు సేవిస్తే అపస్మారమునందు ఉపయుక్తం.